క్లుప్తంగా

శ్రీహిల్స్ కాలనీ కార్యవర్గం ఏడాది పొడగింపు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడలోని శ్రీ హిల్స్ కాలనీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఉన్న కమిటీని మరో ఏడాదిపాటు కొనసాగేలా సంక్షేమ సంఘం ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యాదగిరిరావు, కోశాధికారి రవీందర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు గురునాథ్, నాయకులు సత్యనారాయణరావు, మనోహర్‌రావు, రమేష్‌గౌడ్, రమణాచారి, మల్లేష్‌యాదవ్, రవీందర్, వెంకటయ్య, కృష్ణయ్య, రమావత్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తామని కొండేటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంఖాల్ గ్రామంలో తుక్కుగూడ కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు సాధరణ పరీక్షలను సుమారు 300 మందికి నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాకీ విలాస్, వైద్యులు ప్రమోద్, సౌమ్య, దీప్తి, అఫ్రోజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు

హయత్‌నగర్: కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పేద కుటుంబానికి స్థానికులు చేయూత అందించారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్ గ్రామంలో కుమ్మరివాడకు చెందిన వదులాపురం అశోక్ నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య అనిత ముగ్గురు కుమార్తెలు, కుమారుడితో కలిసి జీవనం సాగిస్తోంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి కుమ్మరి సంఘం నాయకులు ఆదివారం రూ.44 వేలు అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, ఎల్లయ్య, బాలరాజు, వెంకటేష్, శ్రీశైలం, మహేశ్వర్, జంగయ్య, బాలయ్య, కుమార్, సంతోష, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షిక బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో గణపతి, సరస్వతీ, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్షిక బ్రహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయంలో నిత్య అర్చనలు, ధ్వజారోహణం, కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 11.35 నిమిషాలకు శ్రీ సీతారామ స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బస్వారాజ్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

బీజేఆర్ భవన్‌లో ఆధార్ కేంద్రం పునః ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని బాబూజగ్జీవన్ రామ్ (బీజేఆర్) భవనంలో ఆధార్ కేంద్రం మళ్లీ అందుబాటులోకి వచ్చింది.ఇక్కడ ఉన్న ఆధార్ సెంటర్ కొద్ది రోజులుగా పని చేయడం లేదు. అధికారుల కృషితో బీజేఆర్ భవనంలో ఆధార్ సెంటర్‌ను పునఃప్రారంభించారు. ఈ అవకాశాన్ని స్థానికులు ఉపయోగించుకోవాలని ఆధార్ సెంటర్ నిర్వాహకులు బాలరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9293786007ను సంప్రదించాలన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీలోని శాఖా గ్రంథాలయంలో చదువుకుంటూ పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.దేవేంద్ర రావు తన తల్లిదండ్రులు శ్రీరాములు, తులసీ రత్నంల జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.పద్మ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అధికారి సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్, పుండరీకాక్షుడు, వెంకట్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 65, కాకర 35, బీర 50, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 23, క్యారెట్ 35. దొండ 33, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 25, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 80, కాప్సికమ్ 60. సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం



మహేశ్వరం: ప్రచారం చేస్తున్న శ్రీరాములుయాదవ్



మీర్‌పేట: కొండాకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నర్సింహ, నాయకులు

- పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్
- మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం

మహేశ్వరం: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతో సుస్థిర, సుపరిపాలన సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరో దశాబ్దం వెనక్కి పోతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే దేశం అన్ని విధాలుగా రక్షణ ఉంటుందన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేసే కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, నాయకులు పరమేష్, చింటూ, పంతులాల్, సంతునాయక్, నరేష్, యాదయ్య, చందు, నగేష్, రవి, గిరి, రాఘవేందర్, మల్లేష్, నర్సింహ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం

మీర్‌పేట: దేశ రక్షణ, అభివృద్ధి కోసం పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని పార్టీ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ కోరారు. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం మీర్‌పేటలోని పలు ప్రాంతాలలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, భీంరాజ్, యాదగిరియాదవ్, నాగరాజు, జగన్, కుమార్, విక్కీసాగర్, నాగేష్ పాల్గొన్నారు.

మేమంతా బీఆర్‌ఎస్ వెంటే

- ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన మైనార్టీ నాయకులు



కందుకూరు: సబితారెడ్డితో మైనార్టీ నాయకులు

కందుకూరు: కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన మైనార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. నియోజకవర్గంలోని ముస్లింలు బీఆర్‌ఎస్ పార్టీతోనే ఉన్నారని, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రసక్తే లేదని, మేమంతా మీ వెంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఎంఏ సమీర్, నియోజకవర్గం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ దావూద్, నియోజకవర్గ నాయకుడు మహ్మద్ సర్వర్, మండల నాయకులు అహ్మద్, ఇమ్రాన్, నవాస్, అఫ్రోస్, మతిన్, ఖాదర్, తబ్రేస్ పాల్గొన్నారు.

స్వార్థపరులు పార్టీని వీడారు

పహాడీషరీఫ్: వార్డు కౌన్సిలర్ పార్టీ మారినప్పటికీ తామంతా బీఆర్‌ఎస్‌తోనే ఉంటామని జల్‌పల్లి మున్సిపాలిటీ 7వ వార్డు పార్టీ కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ మేరకు నాయకులు షేక్ సలీం, సయ్యద్ ఫెరోజ్ అహ్మద్‌లతో నేతృత్వంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆదివారం కలిసి తామంతా పార్టీకి అండగా ఉంటామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ ఓడిపోగానే మున్సిపాలిటీలోని కొందరు నాయకులు స్వార్థం కోసం పార్టీని వీడారన్నారు. నడవడానికి కూడా వీలు పడని స్థితిలో ఉన్న తమ బస్తీలో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి అభివృద్ధి చేసిన సబితమ్మ వెంటే తామంతా ఉంటామన్నారు. ఆమెను కలిసిన వారిలో రషీద్, ఖాజా, షేర్, యూసుఫ్, కమ్రాన్, యూనుస్, పటాన్, షరీఫ్ తదితరులున్నారు.



పహాడీషరీఫ్: ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన షాహిన్‌నగర్ కార్యకర్తలు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

పహాడీషరీఫ్: అన్ని వర్గాల ప్రజలను సమాన దృష్టితో చూసే కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రంజాన్ ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముస్లింలకు ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పలు వార్డుల నుంచి వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్నో నిధులు వెచ్చించామన్నారు. తనను మరోసారి ఎంపీగా గెలిపిస్తే జల్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నాయకులు నేరెళ్ల శారద, నిజాముద్దీన్, దేప భాస్కర్‌రెడ్డి, యెల్మేటి అమరేందర్‌రెడ్డి, రాజేశ్, కొండల్ యాదవ్, యూసుఫ్ పటేల్, దూడల సుధాకర్‌గౌడ్, సమీర్, సాదిక్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని పిలుపు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం నామినేషన్ వేస్తున్నారని దీనికి చేవెళ్ల ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటల వరకు అంతా చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌కు చేరుకుంటే అక్కడి నుంచి అంతా కలిసి ర్యాలీగా కాళీమందిర్ వద్దకు వెళ్లి అక్కడ పూజలు చేసుకొని రాజేంద్రనగర్‌లోని నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ప్రజల్లో బీజేపీకి ఉన్న ఆదరణను గుర్తించి పార్టీ విజయానికి ఉపయోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మోదీ కోసం బీజేపీకి ఓటు వేస్తామని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. ఈ సారి చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శర్వలింగం, సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సామ మానిక్యరెడ్డి, వైభవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో

భూమిలో చీడపీడల నివారణ

- నేల సారవంతం, భూసారం పెంపునకు దోహదం
- గొర్రెల మంద కట్టడంతో సేంద్రియ ఎరువులు లభ్యం
- రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

షాబాద్: వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వారా భూసార అభివృద్ధికి తోడ్పడుతుంది. అంతేగాక కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడంతో పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. అవి భూమిలోని పోషకాలు స్వీకరించడమే కాకుండా భూమిలో లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ప్రమాదాన్ని నివారించడానికి రైతులు యాసంగి పంటలు చేతికందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం సూచిస్తున్నారు. రైతులు ఈ పద్ధతులు పాటించి ఖరీఫ్‌లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

వేసవి దుక్కులతో లాభాలు ..

వేసవికాలంలో రైతులు పంటకోత అనంతరం పొలాన్ని ఖాళీగా వదిలివేస్తుంటారు. దీంతో తొలకరి వానలు పడగానే నీరు భూమిలోకి ఇంకిపోకుండా బయటకు వెళ్తుంది. వర్షాలకు ముందే భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా భూమిలో తేమ శాతం పెరిగి, భూసారం అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, పోగు, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా సారవంతమైన పంట దిగుబడితో పాటు తేమశాతం పెరుగుతుంది. లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి నేల అనుకూలంగా ఉంటుంది.

భూసారం పుష్కలం..

వేసవి దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడంతో వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడంతో అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణంగా రైతులు పంట చేతికందగానే పంటల నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్త కాల్చివేయకుండా అవకాశమున్న వారు లోతు దుక్కులు చేయటం మూలంగా పంట చెత్త, చెదారం, ఎండు ఆకులు, నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. పంటకు కావలసిన పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి.

చీడపీడలకు చెక్..

వేసవిలో చాలావరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంటకోత దశల్లో వాటి నిద్రావస్థ దశలను నేల, చెత్త, చెదారం, కొయ్య కాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవి లోతు దుక్కుల వలన నిద్రావస్థ దశలో భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, గుడ్లను, పక్షులు, కొంగలు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. అదే విధంగా వేసవి దుక్కులతో భూమి లోపల పొరల్లో ఉన్న శిలీంద్రాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయి.

పర్యాటక కేంద్రంగా వెంకటాపూర్ క్షేత్రం

- ఈ నెల 26 నుంచి శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం

తలకొండపల్లి: శంషాబాద్ విమానాశ్రయానికి 50 కిలో మీటర్ల దూరంలో తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్‌లో వెలిసిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయం అత్యంత పురాతనమైనది. ప్రకృతి ఒడిలో ఉన్న ఈ ఆలయానికి వచ్చే భక్తులకు మానసిక ప్రశాంతత దొరకడంతో పాటు, ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. ఏటా వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 26న ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం అఖండదీపారాధన, మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధనలు, పతాక ఆవిష్కరణ, యజ్ఞహోమాలు, 27న ఉదయం 11.45 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణమహోత్సవం, సాయంత్రం బండ్లసేవ, పల్లకీసేవ, 28న తెల్లవారుజామున 3 గంటలకు రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే మన ప్రాంతంలో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నాయకులు శైలజ, సమత, దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌లు అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆదివారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిని కూడా మనం గెలిపించుకుంటే అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇతర పార్టీలకు ఓటు వేయటంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజలు తెలుసుకోవాలన్నారు. వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ద్వారా రాబోతున్నారని ఆయనను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల శ్రీనివాస్, పెంటయ్యగౌడ్, రాములు, గంగి యాదయ్య, మల్లారెడ్డి, అనంతరాములు, ప్రభాకర్, సూర్యాపేట శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పాండు, రాములు ఉన్నారు.

ఎన్నికలకు సహకరించండి

- యాచారం సీఐ శంకర్‌కుమార్

యాచారం: లోక్‌సభ ఎన్నికలు గ్రామాల్లో ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం కేంద్ర పోలీస్ బలగాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా ప్రశాంత వాతావరణం కోసం కేంద్ర బలగాలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నందివనపర్తిలో పోలీస్ బలగాలతో ర్యాలీ చేస్తున్న సీఐ శంకర్‌కుమార్

వంతెనలు అంతేనా?

- శిథిలమై కుంగిపోతున్న కల్వర్టులు
- వర్షాకాలం వస్తే భయం గుప్పిట్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కొందుర్గు మండలం టేకులపల్లి వద్ద ధ్వంసమైన వంతెన



జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో కుంగిన రావిర్యాల వంతెన

కొందుర్గు: పలు గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కల్వర్టులను విస్తరించడం, వాటిని బాగుచేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోజుల తరబడి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే లోలెవల్ వంతెనకు ఇరువైపు ఉన్న గ్రామాల ప్రజలు భయపడాల్సి వస్తోంది. వాగులు, వంకలు పొంగి వరద నీరు లోలెవల్ వంతెనలపై ఎక్కడ ప్రవహిస్తోయో రాకపోకలు ఎక్కడ నిలిచిపోతాయోనని ఆందోళన చెందడం పరిపాటిగా మారిపోయింది. వంతెనలు దెబ్బతిన డంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే చాలామంది వాహన చోదకులు కిందపడి ప్రమాదాలకు గురయ్యారు. కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి వెళ్లేదారిలో ఉత్తరాసిపల్లి-టేకులపల్లి మధ్య వాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా ధ్వంసమైంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల వంతెన వద్ద పగుళ్లు ఏర్పడి రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించిన సమయంలో రాకపోకలు స్తంభించి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఇక ఈ ఏడాది వర్షాకాలం సమీపిస్తూనే ఉంది. ఈ వర్షాకాలంలో వాగులు ఉధృతితో ప్రవహిస్తే ఈ ఏడాది ఈ వంతెనలు పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయే ప్రమాదముందని వాపోతున్నారు. ఇక జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి వంతెన, కొందుర్గు మండలం వెంకిర్యాల వంతెన, ఉమ్మెంత్యాల లాలపేట వాగులకు వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకిర్యాల వాగుపై వంతెన నిర్మించేందుకు పునాదులు తీసి వదిలేశారని, ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుందని పేర్కొంటున్నారు. కొందుర్గు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే డబుల్ రోడ్డుపై వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతాయని, అర్ధాంతరంగా వంతెన నిర్మాణం పనులు ఆపివేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనలకు మరమ్మతులు చేయించాలని, వంతెనలు లేని వాగులకు నూతనంగా వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.